సాక్షి
ఖమ్మం
7
ఆదివారం। 15। జనవరి। 2023


ఖమ్మంలో భోగిమంట వద్ద స్థానికులు

# ఆనందోత్సాహాల నడుమ 'భోగి'

- ఇంటింటా భోగి మంటలు.. రంగవల్లులతో కొత్త అందం
- పిల్లలకు పండ్లతో వేడుక
- నేడు మకర సంక్రాంతికి సిద్ధం

ఖమ్మంగాంధీచౌక్: 'భోగ'భాగ్యాల పండుగ అయిన భోగిని శనివారం జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. తెల్లవారు జామునే ఇళ్ల ముందు భోగి మంటలు వేయడంతో పాటు వాకిళ్లను అందమైన ముగ్గులతో తీర్చిదిద్దారు. సంప్రదాయ పద్ధతుల్లో పీడలు తొలిగిపోతాయనే నమ్మకంతో పాత వస్తువులను భోగి మంటల్లో వేసి నూతనత్వానికి స్వాగతం పలుకుతూ పండుగను ప్రారంభించారు.


నివాసముండే గుడిసె ఎదుట ముగ్గు తీర్చిదిద్దుతున్న మహిళ

ఇళ్ల లోగిళ్లకు కళ తెచ్చిన రంగవల్లులు

ముగువలు భోగి పండుగ ఉట్టిపడేలా ఇళ్ల వాకిళ్లలో అందమైన రంగులతో ముగ్గులను వేశారు. కొన్నిచోట్ల అర్ధ రాత్రి నుంచే ముగ్గులు వేయడం మొదలుపెట్టి తెల్లారేసరికి పూర్తిచేశారు. పాలు పొంగుతున్నట్లు పాత్రలు, చెరకు గడలు, భోగి మంటలతో వేసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. అలాగే, భోగి సంప్రదాయం ప్రకారం పిల్లలపై భోగి పండ్లు పోసే కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు.

**నేడు సంక్రాంతి**

ఆదివారం సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించనున్న నేపథ్యాన మకర సంక్రాంతిని జరుపుకోనున్నారు. సంక్రాంతి ప్రధానంగా రైతుల పండుగ. ఈ పండుగ సందర్భంగా కొత్త పంట ఇళ్లకు చేరడంతో ఇంటిల్లిపాది సంతోషంగా పండుగ జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే పల్లెపట్నం నుంచి స్వస్థలాలకు పిల్లాపాపలు చేరడంతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. ప్రధానంగా అరిసెలు, సకినాలు వంటి పిండిపంటలు ఈ పండుగ ప్రత్యేకం కాగా.. పొంగలిని కూడా వండి దేవతలకు నైవేద్యం సమర్పించనున్నారు. మరోపక్క పిల్లలు పతంగులు ఎగరవేస్తూ ఆనందంగా గడుపుతున్నారు.



# బీఆర్ఎస్.. సంక్రాంతి

- కళ ఉట్టిపడేలా సభాప్రాంగణానికి హంగులు
- సీఎం సహా మంత్రుల భారీ కటౌట్లు
- నగరాన్ని గులాబీమయం చేస్తున్న పార్టీ శ్రేణులు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్


ప్రధాన రహదారి వెంట ఏర్పాటుచేసిన కటౌట్లు


సభాప్రాంగణంలో పరిశీలిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ, మాజీ మంత్రి తుమ్మల తదితరులు


నూతన కలెక్టరేట్ ఎదురుగా ఏర్పాటుచేసిన భారీ కటౌట్లు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: బీఆర్ఎస్ ఆవిర్భావ సభ జరగనున్న ఖమ్మంలోని ప్రాంగణమంతా పండుగ కళ ఉట్టిపడేలా హంగులద్దుకుంటోంది. టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌గా రూపాంతరం చెందాక నిర్వహిస్తున్న తొలి సభ కావడంతో ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. సంక్రాంతి పండుగ అంతా సన్నాహక సమావేశాల్లో.. సభలోనే చూసుకోవాలని.. సభే మనకు పండుగ అంటూ మంత్రులు కేడర్‌కు సూచిస్తుండడంతో అంతా పనుల్లో నిమగ్నమయ్యారు. సీఎం కేసీఆర్‌తో పాటు కేరళ, ఢిల్లీ, పంజాబ్ ముఖ్యమంత్రులు, మాజీ సీఎం అఖిలేష్ యాదవ్, రాష్ట్ర మంత్రులకు సంబంధించి భారీ కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం నగరంతోపాటు శ్రీశ్రీ సర్కిల్ నుంచి సభాస్థలి వరకు గులాబీ మయంగా మారుతోంది.

**సజావుగా సాగేలా..**

సభను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్ అధిష్ఠానం బాధ్యతలు అప్పగించిన నేతలంతా పనుల్లో బిజీగా ఉన్నారు. మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ పనులను పర్యవేక్షిస్తూనే సన్నాహక సమావేశాల నిర్వహిస్తూ నేతలను సమన్వయం చేస్తున్నారు. అలాగే శనివారం కూడా మంత్రులు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, జగదీష్‌రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ నామ నాగేశ్వరరావు తదితరులు సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆతర్వాత సీపీ, అదనపు డీసీపీ, ఏసీపీలతో ఏర్పాట్లపై సమీక్షించి భద్రతపై సూచనలు చేశారు.

**ఉమ్మడి జిల్లాను చుట్టేసేలా..**

సభ విజయవంతం కోసం ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఖమ్మం జిల్లాలో సమావేశాలు పూర్తికాగా, శనివారం నుంచి ఇల్లెందు సమావేశంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ సన్నాహక భేటీలకు శ్రీకారం చుట్టారు. ఆవిర్భావ సభ సందర్భంగా జిల్లాలోని బీఆర్ఎస్ శ్రేణులన్నీ ఒకేతాటిపైకి వచ్చాయి. అందరూ కలిసికట్టుగా పర్యటనలు చేస్తూ కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు అందరూ ఈ సభపైనే దృష్టి సారించారు.

**గులాబీమయం చేసేలా..**

నగరాన్ని గులాబీమయం చేసేలా భారీస్థాయిలో హోర్డింగ్‌లు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే శ్రీశ్రీ సర్కిల్ నుంచి సభాప్రాంగణం వరకు కటౌట్లు ఏర్పాటు చేయగా.. రెండు రోజుల్లో మిగతా చోట్ల కూడా కటౌట్లు, హోర్డింగ్‌ల ఏర్పాటు పూర్తికానుంది. దేశ్ కీ నేత కేసీఆర్, సపోర్ట్ ఫార్మర్స్, వుయ్ లవ్ ఫార్మర్స్.. నినాదాలు, చిత్రాలతో కటౌట్లు సిద్ధం చేస్తున్నారు. ఇక నగరంలోని ప్రధాన రహదారులే కాక సభా ప్రాంగణానికి వెళ్లే మార్గంలో రహదారులను శుభ్రం చేయడం, డివైడర్ల నడుమ మొక్కలు నాటే పనులు చివరి దశకు చేరాయి. కొత్తగా నిర్మించిన రహదారిపై సెంట్రల్ లైటింగ్ కూడా మొదలైంది.

**ఆకర్షించేలా ప్రధాన వేదిక**

సభా ప్రాంగణం ఏర్పాటు ఒక ఎత్తయితే.. ప్రధాన వేదిక అందరినీ ఆకర్షించేలా సిద్ధం చేస్తున్నారు. ఈ పనిని టీఎస్ఐఐసీ చైర్మన్ గ్యాదరి బాలమల్లుకు అప్పగించారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌తోపాటు మూడు రాష్ట్రాల సీఎంలు, మాజీ సీఎం అఖిలేష్‌యాదవ్‌తోపాటు కమ్యూనిస్టు పార్టీల జాతీయ నేతల ఫొటోలు ఈ వేదికపై ఏర్పాటుచేసే ప్రధాన ఫ్లెక్సీపై చిత్రించనున్నట్లు సమాచారం.



# వందేభారత్ వస్తోంది!

- సికింద్రాబాద్ – విశాఖ రైలు నేడు ప్రారంభం
- తొలిరోజు మధ్యాహ్నం 1.30గంటలకు ఖమ్మంలో స్వాగతం
- రేపటి నుంచి ఇరువైపులా రాకపోకలు




ఖమ్మం స్టేషన్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



**ఘనస్వాగతానికి ఏర్పాట్లు**

"వందేభారత్ రైలు తొలిసారి ఖమ్మం స్టేషన్‌కు రానుంది. మొదటిరోజు ప్రజలంతా రైలును చూడడానికి వచ్చే అవకాశమున్నందున అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. సోమవారం నుండి ప్రయాణికులకు రైలు అందుబాటులోకి రానున్నది."

– జీ.ఎస్.వీ.ప్రసాద్, రైల్వేస్టేషన్ మేనేజర్, ఖమ్మం

ఖమ్మం మామిళ్లగూడెం: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన అత్యాధునిక వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఖమ్మం మీదుగా రాకపోకలు సాగించనుంది. దేశంలోని పలు రాష్ట్రాల్లో ఇప్పటికే వందేభారత్ రైలు ద్వారా సేవలందిస్తుండగా.. తెలుగు రాష్ట్రాలకు తొలి రైలును కేంద్రప్రభుత్వం కేటాయించింది. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం వరకు ప్రయాణం సాగించే ఈ రైలును ఢిల్లీ నుంచి ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్‌గా ప్రారంభిస్తారు. ఈ రైలుకు ఖమ్మం రైల్వే స్టేషన్‌లో హాల్టింగ్ ఇవ్వగా.. తొలిరోజు ఘన స్వాగతం పలికేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ నుంచి రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారులు శనివారం ఖమ్మం చేరుకుని ట్రాక్‌లు, సిగ్నల్ వ్యవస్థ పనితీరు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు.

**స్వాగత ఏర్పాట్లు**

వందేభారత్ రైలు తొలిసారి ఖమ్మం స్టేషన్‌కు వస్తున్న నేపథ్యాన రైల్వే శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైలుకు స్వాగతం పలకడంతో పాటు ప్రయాణికులను ఆకట్టుకునేలా స్టేషన్ మేనేజర్ ఆధ్వర్యాన అలంకరిస్తున్నారు. రైలు వచ్చిన సమయంలో సందర్శకులు ప్లాట్‌ఫామ్‌పై కొంచెం దూరంలో నిలబడి చూసేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇక ఖమ్మం స్టేషన్‌తోపాటు మధిర రైల్వే స్టేషన్‌లో కూడా ఆదివారం రైలు కాసేపు నిలపనున్నారు. ప్రారంభం రోజైన ఆదివారం రైలు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1.30 గంటలకు ఖమ్మం స్టేషన్‌కు చేరుకుంటుంది. సోమవారం నుంచి మాత్రం ప్రతిరోజు సికింద్రాబాద్ – విశాఖ మార్గంలో ఖమ్మం స్టేషన్‌కు సాయంత్రం 5.45 గంటలకు, విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లేటప్పుడు ఉదయం 11 గంటలకు ఖమ్మం వస్తుంది.

**ఏర్పాట్లపై అధికారుల పరిశీలన**

వందేభారత్ రైలు తొలిసారి ఖమ్మం స్టేషన్‌కు ఆదివారం చేరుకోనుండడంతో అధికారులు స్టేషన్‌లో ఏర్పాట్లపై దృష్టి సారించారు. సికింద్రాబాద్ నుంచి ఏడీఎస్‌టీఈ ప్రశాంత్ కాకడే శనివారం సాయంత్రం ఖమ్మం చేరుకున్నారు. స్టేషన్ మేనేజర్ జీ.ఎస్.వీ.ప్రసాద్, హెచ్ఐ మోహన్‌కుమార్, సీఐ జాఫర్, ఎస్ఎస్ఈ అనిల్‌కుమార్, టీఐ వీ.ఆర్.ఎల్.వీ.శాస్త్రితో కలిసి ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

**ఖమ్మం నుంచి స్టేషన్ల వారీగా చార్జీల వివరాలు (రూ.ల్లో)**

| స్టేషన్ | చైర్‌కార్ | ఎగ్జిక్యూటివ్ క్లాస్ |
|---|---|---|
| విజయవాడ | 459 | 935 |
| రాజమండ్రి | 975 | 1,105 |
| విశాఖపట్నం | 1,280 | 2,325 |
| వరంగల్ | 470 | 900 |
| సికింద్రాబాద్ | 750 | 1,460 |

## క్లుప్తంగా

### మహిళను వివస్త్రగా చేసి దాడి

నేలకొండపల్లి: మండలంలోని బోదులబండలో ఓ మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బోదులబండకు చెందిన మహిళలపై అదే గ్రామానికి చెందిన పొట్టపింజర నాగేశ్వరరావు, రేణుక పాత కక్షలను దృష్టిలో ఉంచుకుని దాడి చేశారు. జుట్టు పట్టుకుని కొడుతూ వివస్త్రను చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

### కానిస్టేబుల్ మృతికి సంతాపం



కానిస్టేబుల్ కుమారుడిని పరామర్శిస్తున్న అధికారులు

కొణిజర్ల: కొణిజర్ల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ నహేమ్యా(54) గుండె పోటుతో శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. 1984 బ్యాచ్‌కు చెందిన నహేమ్యా ఖమ్మంలో నివాసముంటూ కొణిజర్లలో విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం ఉదయం ఆయనకు గుండెలో నొప్పి రావడంతో కుటంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైరా ఏసీపీ ఎం.ఏ.రెహమాన్, సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై టి.యయాతి రాజు తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి భార్యాపిల్లలను పరామర్శించారు. అలాగే, అంత్యక్రియల నిమిత్తం పోలీసు అసోసియేషన్ సభ్యులు ఎం.వెంకటేశ్వర్లు, మోహనరావు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు.

### చెట్టును ఢీకొట్టిన ద్విచక్ర వాహనం.. వ్యక్తి మృతి



రామయ్య (ఫైల్)

కొణిజర్ల: ద్విచక్ర వాహనంపై అతివేగంగా వెళ్తున్న వాహనదారుడు చెట్టును ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. కొణిజర్ల ఎస్‌ఐ యయాతిరాజు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని రామనర్సయ్య నగర్‌కు చెందిన తమ్మిశెట్టి రామయ్య(28) ఖమ్మంలో సుతారి పనులు చేస్తూ రోజూ ద్విచక్రవాహనంపై వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో శనివారం పనికి వెళ్లి వచ్చే క్రమంలో ఎన్‌టీఆర్ నగర్ వద్ద ఉన్న మూలమలుపు కల్వర్టు సమీపాన గుంతను తప్పించే క్రమంలో పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ఘటనలో రామయ్య తలకు తీవ్ర గాయం కావడంతో ఘటనాస్థలిలోనే మృతి చెందాడు. ఆయనకు భార్య జ్యోతి, మూడేళ్ల కూతురు, ఏడాది వయస్సు కుమారుడు ఉన్నారు.

### రెండు దుకాణాల్లో చోరీ


మధిర: పట్టణంలోని రాయపట్నం రోడ్డులో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. అనుముల పుల్లారావు, గుగ్గిలం రంగనాయకులు కిరాణ దుకాణాల్లో శుక్రవారం అర్ధరాత్రి దాటాక దుండగులు చోరీకి పాల్పడి రూ.30వేలు విలువైన వస్తువులు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

మధిర: జిల్లాలోని చిన్నకోరుకొండికి చెందిన చింతమాల సురేష్ మధిర సమీపాన దెందుకూరు ఫ్లై ఓవర్ వద్ద శనివారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. బీటెక్ పూర్తిచేసిన ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. అయితే, ఘటనా సమాచారం తెలుసుకుని చేరుకున్న రైల్వే పోలీసులు, అన్నం ఫౌండేషన్ సభ్యులు రెండు కిలోమీటర్ల వెతికినా తల దొరకకపోగా, మొండెం మాత్రమే ఉండడంతో మధిర ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కాగా, మృతదేహం వద్ద లభించిన సెల్‌ఫోన్, ఆధార్ కార్డు ఆధారంగా ఆచూకీ గుర్తించారు. అలాగే, 'అందరికీ సారీ.. టు ఆల్.. మమ్మీ, డాడీ అక్క చెల్లి' అని రాసిన పేపర్ ప్లేట్ లభించింది. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు మధిర హెడ్ కానిస్టేబల్ ఎస్.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు.

### అదుపు తప్పిన తుఫాన్ వాహనం

18 మంది వలస కూలీలకు గాయాలు



గాయపడ్డ మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

బూర్గంపాడు: మధ్యప్రదేశ్ నుంచి కొత్తగూడెం వస్తున్న తుఫాన్ వాహనం మండలంలోని సారపాక సమీపంలో ఉన్న పుష్కరవనం వద్ద శనివారం అదుపు తప్పి బోల్తాపడింది. తుఫాన్ వాహనం వెనుక టైరు బోల్ట్‌లు ఊడిపోవటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వాహనంలో 20 మంది కూలీలు ఉండగా 18 మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురు తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా కూలీలు కొత్తగూడెం సమీప గ్రామాల్లో మిర్చి కోతలకు వస్తున్నారు.

## ఖాళీ అవుతున్న కలెక్టరేట్ !

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కొత్త కలెక్టరేట్)ను ఈనెల 18న ప్రారంభించనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతుండగా.. మరోపక్క ప్రస్తుత కలెక్టరేట్ నుంచి శాఖల వారీగా సామగ్రిని తరలిస్తున్నారు. ప్రస్తుతం ప్రజ్ఞా సమావేశ మందిరంలోని సామాగ్రిని తరలించడంతో ఇన్నాళ్లు కుర్చీలు, టేబుళ్లతో నిండిన ఆ హాల్ బోసిపోయి కనిపిస్తోంది. అలాగే, పౌరసరఫరాల శాఖ, పౌరసరఫరాల సంస్థ కార్యాలయాల సామగ్రిని ఉద్యోగులు శనివారం తరలించారు. ఇక పాత కలెక్టరేట్‌ను మెడికల్ కళాశాలకు అప్పగించడంతో ఇక్కడ మిగిలిన ఫర్నీచర్‌ను కళకళలాడేలా తీర్చిదిద్దుతున్నారు.

– ఖమ్మం సహకారనగర్



సామగ్రి తరలించడంతో బోసిపోతున్న ప్రజ్ఞా సమావేశ మందిరం



సామగ్రి ప్యాక్ చేస్తున్న పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు



కలెక్టరేట్‌లో మిగిలిన ఫర్నీచర్‌కు మెరుగులు దిద్దుతున్న దృశ్యం

### కుల బహిష్కరణ ఘటనపై కేసు నమోదు

ములకలపల్లి : కులపెద్దలు విధించిన జరిమానా చెల్లించలేదని, భౌతిక దాడి చేసి, తాగునీటి సరఫరా నిలిపివేసి, కుల బహిష్కరణకు పాల్పడిన ఘటనపై పోలీసులు శనివారం సమగ్ర విచారణ చేపట్టారు. మండల పరిధిలోని రాచన్నపేట గ్రామానికి చెందిన పెనుబల్లి శ్రీనివాస్ ఏడాది క్రితం మనస్పర్థలతో ఇంటి నుంచి వెళ్లిన భార్య శారదను.. తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు. దీంతో గ్రామస్తులు కులపంచాయితీ నిర్వహించి, రూ. 1.5 లక్షలు జరిమానా చెల్లించాలని పేర్కొన్నారు. కాగా శ్రీను రూ.20 వేలు మాత్రమే ఇస్తానని చెప్పడంతో ఆగ్రహించిన గ్రామస్తులు, శ్రీను కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. ఆ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేస్తున్నట్లు టమకా వేయించారు. ఈ ఘటనపై శనివారం మీడియాలో కథనాలు రావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. గ్రామాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు.

### శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్న మంత్రి



పూజలు నిర్వహిస్తున్న మంత్రి తదితరులు

ముదిగొండ: మండలంలోని ముత్తారంలో శ్రీసీతారామచంద్రస్వామిని శనివారం ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దర్శించుకుని పూజలు చేశారు. ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యాన మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేయించాక సన్మానించారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సర్పంచ్ తుపాకుల రమాదేవి, జెడ్పీటీసీ దుర్గ, సీఎం పీఆర్వో జ్వాలా నర్సింహారావుతో పాటు యలగొండ స్వామి, వెంకటయ్య, లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారికి ప్రత్యేక పూజలు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలోని శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించిన అర్చకులు, స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించారు. భోగి పర్వదినం కావడంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. ఈమేరకు శ్రీవారి పల్లకీ సేవలో కూడా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

### గంగమ్మకు వెండి పడగ వితరణ



నాగేంద్రుడి పడగ అందజేస్తున్న నర్సింహారెడ్డి

కూసుమంచి: కూసుమంచి గంగాదేవి ఆలయంలోని గంగమ్మ తల్లి ఆలయానికి పంచముఖ నాగేంద్రుడి పడగను విజయవాడ కస్టమ్స్ అడిషనల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి శనివారం అందజేశారు. తన తండ్రి, మాజీ పోలీస్ అధికారి సాధు వీరప్రతాప్‌రెడ్డితో కలిసి ఆయన పడగ అందజేయగా అర్చకులు సన్మానించారు. సర్పంచ్ చెన్నా మోహన్‌రావు, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్‌రావు, అర్చకుడు వీరవెల్లి నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## హోంమంత్రిని కలిసిన నూర్‌బాషా నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం : రాష్ట్ర మైనార్టీ ముస్లిం నూర్‌బాషా /దూదేకుల వృత్తి సంక్షేమ సంఘం బాధ్యులు శనివారం హైదరాబాద్‌లో హోంమంత్రి మహమూద్ అలీ, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌ను కలిశారు. ఈమేరకు బీఆర్ఎస్‌లో కష్టపడి పనిచేస్తున్న దూదేకుల నాయకులకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ సిద్దాసాహెబ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.డీ.సుభాన్ అలీ, గౌరవ అధ్యక్షుడు షేక్ జానీ, నాయకులు అబ్దుల్ పాషా, సైదులు, ఖాదర్ బాబు, ఇబ్రహీం, బాబూమియా, జాకీర్, అహ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.



హోంమంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

## మాజీ ఎంపీకి శుభాకాంక్షల వెల్లువ

కల్లూరు: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్వస్థలమైన మండలంలోని నారాయణపురంలో సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు శనివారం వచ్చారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అనుచరులు ఆయనను కలిసి భోగి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎంపీని కలిసిన వారిలో భద్రాద్రి జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, నాయకులు జారే ఆదినారాయణ, తుమ్మా చౌదరి, దొడ్డా నగేష్, గోపాలరావు, ధరావత్ మోహన్ నాయక్, మట్టూరి జనార్దన్ తదితరులు ఉన్నారు.



పొంగులేటికి శుభాకాంక్షలు చెబుతున్న ముస్లిం నాయకులు

### మంత్రి, ప్రముఖుల సంక్రాంతి శుభాకాంక్షలు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లా ప్రజలకు మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మకర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సిరి సంపదలు, ఆయురారోగ్యాలతో తులతూగాలని ఆయన ఓ ప్రకటనలో ఆకాంక్షించారు. అలాగే, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు కూడా వేర్వేరు ప్రకటనల్లో ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

### వైభవంగా మకరజ్యోతి దర్శనం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం శ్రీనివాస్‌నగర్‌లో ఉన్న శ్రీ శాస్త దేవస్థానంలో శనివారం రాత్రి మకరజ్యోతి దర్శన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ పూజారి, కార్యనిర్వాహక ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించారు. ఆలయంలో ఏర్పాటుచేసిన జ్యోతిని వెలిగించగా పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా అయ్యప్ప భక్తులు, మాలధారుల శరణు ఘోషతో ఆలయ ఆవరణ మార్మోగింది.



ఆలయంలో వెలుగుతున్న మకర జ్యోతి

### గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో తండ్రీకుమారుల సత్తా



మైఖేల్, రవికిరణ్

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి రవికిరణ్, ఆయన కుమారుడు మైఖేల్ ఇమ్మానియల్ గ్రూప్–1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యారు. కుమారుడిని గ్రూప్ – 1 ఆఫీసర్‌గా చూడాలన్న ఆశయంతో తండ్రి రవికిరణ్ తాను చదువుతూ కుమారుడిని పరీక్షకు సిద్ధం చేయించారు. ఈ మేరకు ఇద్దరూ ప్రిలిమ్స్‌లో సత్తా చాటారు.



## ఎంపీని కలిసిన డీఐఈఓ, అధ్యాపకులు

సత్తుపల్లి: సత్తుపల్లి, కందుకూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నూతన భవనాలను నిర్మించేందుకు ముందుకొచ్చిన రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డికి పలువురు కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు ఆయన స్వగ్రామమైన కందుకూరులో శనివారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు, ఎస్‌బీఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.వెంకటేశ్వరరావు తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ సత్తుపల్లి కళాశాల భవనాన్ని జీ+2 విధానంలో అత్యాధునికంగా నిర్మించడమే కాక, హెటీరో సంస్థ నుంచి ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్‌లు ఏర్పాటుచేయిస్తామని హామీ ఇచ్చారు.



ఎంపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఐఈఓ

### బాధ్యతలు స్వీకరించిన మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులైన డాక్టర్ రాజేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌కు నుంచి వచ్చిన ఆయనకు జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ శ్రీనివాసరావు, ఏఓ రాజశేఖర్ స్వాగతం పలికారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రాజేశ్వరరావును పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ అమర్‌సింగ్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణతో పాటు నందగిరి శ్రీను, ఆర్వీఎస్.సాగర్ తదితరులు పాల్గొన్నారు. కాగా, బాధ్యతలు స్వీకరించాక ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలవగా, కళాశాల శంకుస్థాపనతోపాటు పాత కలెక్టరేట్‌లో కళాశాల ఏర్పాట్లకు సిద్ధం కావాలని సూచించారు.



ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఉద్యోగులు

## భద్రతా ఏర్పాట్లపై ఎమ్మెల్సీ సమీక్ష



పోలీసు అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్సీ

రఘునాథపాలెం: ఈనెల 18న జరగనున్న బీఆర్ఎస్ బహిరంగ సభ ఏర్పాట్లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ శనివారం పరిశీలించి సీపీ విష్ణు ఎస్.వారియర్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సభా ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లు, వాహనాల రాకపోకలకు రూట్ మ్యాప్, పార్కింగ్ ఏర్పాట్లపై చర్చించి సూచనలు చేశారు. సభావేదికకు సమీపాన పార్కింగ్ ఏర్పాట్లు చేస్తుండగా, ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులకు తమ పార్టీ వలంటీర్లు కూడా సాయంగా నిలుస్తారని ఎమ్మెల్సీ తెలిపారు. అడిషనల్ డీసీపీలు శబరీష్, సుభాష్‌చంద్రబోస్, ఏసీపీలు రమేష్, బస్వారెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్, ప్రసన్నతో పాటు నాయకులు రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన రాష్ట్రస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ టోర్నీ



గెలుపొందిన ఖమ్మం జిల్లా బాలికల జట్టు

బాలికల విభాగంలో విజేతగా జిల్లా జట్టు

బోనకల్: బోనకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 67వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. రాష్ట్రంలోని పాత తొమ్మిది జిల్లాల నుంచి బాలురు, బాలికల జట్లు హాజరుకాగా, బాలుర విభాగంలో నిజామాబాద్ జట్టు, బాలికల విభాగంలో ఖమ్మం జిల్లా జట్టు విజేతలుగా నిలిచాయి. జట్లకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, సీపీఎం నాయకుడు పోతినేని సుదర్శన్‌రావు, తెలంగాణ బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పొట్ల రామకృష్ణారావు ట్రోఫీలు అందజేశారు. కోచ్ అమిరేసి లింగయ్య, పీఈటీలు పాల్గొన్నారు.

### అసోసియేట్ అధ్యక్షుడిగా విజయ్

కొత్తగూడెంరూరల్: తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మహబూబాబాద్‌లో విద్యుత్ శాఖ డీఈగా విధులు నిర్వర్తిస్తున్న విజయ్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్ మనోహర్, జనరల్ సెక్రటరీ ఎం.రమేష్, ఎన్పీడీసీఎల్ విభాగం అధ్యక్షుడు ఎ.ఆనందమ్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఆయన్ను శనివారం పలువురు అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా విజయ్ తెలిపారు.

## దాడి ఘటనలో పరస్పరం ఫిర్యాదు..

ఎనిమిది మందిపై కేసు

ఖమ్మంరూరల్: తిరుమలాయపాలెం మండలం కొక్కిరేణికి చెందిన బెల్లం శ్రీనివాసరావుపై మండలంలోని కొండాపురం వద్ద దాడి చేసిన వ్యక్తులు చంపుతామని బెదిరించారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి జరగగా పోలీసులు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం నుండి స్వగ్రామమైన కొక్కిరేణికి శుక్రవారం రాత్రి కారులో శ్రీనివాసరావు వెళ్తుండగా, సీతారాంపురం శివార్లలో అదే గ్రామానికి చెందిన చింతమల్ల బాబు, మట్ట లింగరాజు, జాల గోపి తదితరులు రోడ్డుకు అడ్డంగా ద్విచక్ర వాహనం ఉంచి కల్వర్టుపై మద్యం సేవిస్తున్నారు. దీంతో వాహనం పక్కకు తీయాలని కోరగా శ్రీనివాసరావుపై దాడి చేయడమే కాక చంపుతామని బెదిరించారని ఫిర్యాదు చేయగా శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు. అయితే, తాము రహదారి పక్కన మాట్లాడుతుండగా, శ్రీనివాసరావు వాహనం తీయాలని సూచిస్తూ దుర్భాలాడాడని బాబు తదితరులు పేర్కొన్నారు. అలాగే, శ్రీనివాసరావు ఇచ్చిన సమాచారంతో కొక్కిరేణికి చెందిన దొడ్డి చలం, ఖాదర్‌బాబు, కల్లం వీరయ్య, దొడ్డి వెంకటేశ్వర్లు, ఊడుగు ఉపేందర్ తదితరులు ఆటోలో వచ్చి దాడి చేశారని బాబు చేసిన ఫిర్యాదుతో మరో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటకృష్ణ వెల్లడించారు.

### పేలిన ప్రెజర్‌బాంబు

సీఆర్పీఎఫ్ ఏఎస్సైకి తీవ్ర గాయాలు

చర్ల : తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలి సీఆర్పీఎఫ్ ఏఎస్సైకి తీవ్ర గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్‌స్టేషన్ పరిధి పెగడపల్లి సీఆర్పీఎఫ్ 153 బెటాలియన్ క్యాంపునకు చెందిన జవాన్లు శనివారం ఉదయం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. బీజాపూర్ - సుకుమా ప్రధాన రహదారి మీదుగా వారు వెళ్తుండగా.. పోలీసు బలగాలు వస్తాయనే సమాచారంతో మావోయిస్టులు ఆ రహదారిపై ప్రెజర్‌బాంబు ఏర్పాటుచేశారు. అయితే, బలగాల్లోని సీఆర్పీఎఫ్ ఏఎస్సై మహ్మద్ అస్లాం గమనించకుండా ప్రెజర్ బాంబుపై కాలు వేయడంతో అది పేలగా తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో ఆందోళనకు గురైన సహచర జవాన్లు కొంత దూరం పరుగులు తీసి వెనక్కి వచ్చి చూడగా అస్లాంకు తీవ్రంగా గాయపడి ఉండడంతో బాసగూడకు తీసుకెళ్లి ప్రథమచికిత్స అనంతరం ప్రత్యేక హెలీకాప్టర్‌లో రాయ్‌పూర్ వైద్యశాలకు తరలించారు. కాగా, క్షతగాత్రుడు అస్లాం బిహార్ రాష్ట్రంలోని బోజ్‌పుర జిల్లా భగాయ్ వాసిగా తెలిసింది.